చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి



చిన్నారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

దుండిగల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం ఆయన దుండిగల్, బహదూర్‌పల్లి ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఓల్డ్ ఏజ్ హోమ్‌ను సందర్శించారు. కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా సీడీపీఓ శారద, మండల స్పెషలాఫీసర్ బాబు మోసెస్, తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతీన్, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, అంగన్‌వాడి సూపర్‌వైజర్ శోభారాణి, సిబ్బంది ఉన్నారు.

ఎంఎల్ఆర్ఐటీలో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్



ఎంఎల్ఆర్ఐటి కళాశాలలో జరిగిన సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు..

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్‌ను నిర్వహించారు. సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిద్దేందుకు ఇలాంటి సమావేశాలు ఎంతగానో దోహదపడతాయని వక్తలు పేర్కొన్నారు. బడగర్‌వాలా టెక్ ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధి మనోజ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే శ్రీనివాసరావు రావు, కో ఆర్డినేటర్ డాక్టర్ బలరాం తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అందజేత



బాధితులకు సెల్ ఫోన్లను అందజేస్తున్న సీఐ శ్రీనాథ్

శామీర్‌పేట్: పోగొట్టుకున్న, అపహరణకు గురైన సెల్ ఫోన్లను రికవరీ చేసిన శామీర్‌పేట పోలీసులు మంగళవారం బాధితులకు అప్పగించారు. శామీర్‌పేట సీఐ శ్రీనాథ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాదిలో సెల్ ఫోన్లు పోయినట్లు 19 ఫిర్యాదులు అందాయన్నారు. సాంకేతికతను వినియోగించి ఇప్పటివరకు 11 ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందిచినట్లు తెలిపారు. తమ సెల్‌ఫోన్లను అప్పగించడం పట్ల బాధితులు సంతోషం వ్యక్తం చేశారు.



సెల్లార్ నిర్మాణంలో పక్కనే కూలిపోయిన ప్రహరీ

అక్రమ సెల్లార్లకు అడ్డుకట్టేదీ..?

చెరువులను తలపిస్తున్న సెల్లార్లు

- సర్కిల్-25లో అక్రమ సెల్లార్లకు అనుమతి
- సెల్లార్‌తో చుట్టూ పక్కల భవనాలకు పొంచి ఉన్న ప్రమాదం
- స్థానికుల ఫిర్యాదుతో రూ. 2 లక్షల జరిమానా
- ప్రమాదాలు జరిగితే కానీ చర్యలు తీసుకోరా అని స్థానికుల ఆగ్రహం

కుత్బుల్లాపూర్: నగర శివారు ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా సెల్లార్లు చెరువులను తలపిస్తున్నాయి. సెల్లార్ వల్ల ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఇప్పటికే గ్రేటర్ అధికారులు రంగంలోకి దిగారు. అయితే కొన్ని చోట్ల మాత్రం అధికారుల ఉదాసీనత వైఖరి, నిర్లక్ష్యం కారణంగా అక్రమ సెల్లార్లు వెలుస్తున్నాయి. వర్షాకాలంలో ఈ సెల్లార్లకు అనుమతి ఇవ్వడం ఏ స్థాయిలో ప్రమాదాలు జరుగుతాయో తెలిసి కూడా కొందరు అధికారులు అనుమతి ఇవ్వడం గమనార్హం. ఈ క్రమంలోనే కుత్బుల్లాపూర్ సర్కిల్- 25లో మాత్రం అక్రమ సెల్లార్లకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. పేట్ బషీరాబాద్ సమీపంలోని ఎస్పీజీ గ్రాండ్ హోటల్ లైను హైటెన్షన్ రోడ్డులో ఓ వ్యక్తి 400 పైగా గజాల స్థలంలో జోనల్ స్థాయిలో అనుమతి తీసుకొని సెల్లార్ తవ్వకం చేపట్టాడు. అయితే గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సెల్లార్ చుట్టూ మూడు వైపుల ఉన్న భవనాలకు ప్రమాదం పొంచి ఉంది.

గోడలు కూలుతున్న క్రమంలో...

సెల్లార్ పక్కనే ప్రహరీ గోడలు కూలుతున్న క్రమంలో ఉప కమిషనర్ నరసింహ, టౌన్ ప్లానింగ్ అధికారి ప్రభావతికి స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఒకటో తేదీ ఆదివారం అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి సందర్శించారు. అనంతరం సెల్లార్ నిర్మాణాన్ని ఆపాలని సదరు యజమానికి ఆదేశాలు జారీ చేసి రూ.2 లక్షలు జరిమానా విధించారు. చుట్టుపక్కల భవనాలకు ఏమైనా జరిగితే దానికి బాధ్యత నాదే అని సంబంధిత యజమానితో లేఖ కూడా రాపించారు. ఈ క్రమంలో సోమవారం సైతం సెల్లార్ పక్కనే ఉన్న ప్రహరీ కూలిపోయింది. సంబంధిత అధికారులు మాత్రం గత నెల రోజుల నుంచి ఇక్కడ సెల్లార్ పనులు జరుగుతున్న పట్టించుకోకుండా, వర్షాలు పడుతున్న క్రమంలో స్థానికుల ఫిర్యాదుతో మేల్కొనడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హడావుడిగా నోటీసు...



హై టెన్షన్ రోడ్డులో జరుగుతున్న సెల్లార్ నిర్మాణంపై అధికారులు హడావుడిగా సోమవారం నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా ఓ సంస్థ ద్వారా సేకరించిన చెత్తను సెల్లార్‌లో వేసి నింపేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం లేఖ రాశారు. జోనల్ స్థాయిలో అనుమతి తీసుకున్న వ్యక్తి ఓ టౌన్ ప్లానింగ్ అధికారి కనుసన్నల్లో సెల్లార్ తవ్వకాలు చేపట్టగా సదరు అధికారి అకస్మాత్తుగా బదిలీ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన టౌన్ ప్లానింగ్ అధికారి ప్రభావతి గతంలో ఏమైనా నోటీసులు జారీ చేశారా అన్న విషయాన్ని పరిశీలించగా అటువంటి దాఖలాలు లేకపోవడం విశేషం. అయితే దీనిపై ఆమె వెంటనే స్పందించి సదరు నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని నోటీసు జారీ చేయడం కొసమెరుపు. ఏదీ ఏమైనా ప్రమాదం జరగకముందే జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేతకు సత్కారం

జవహర్‌నగర్: భూదాన్‌పోచంపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జవహర్‌నగర్‌కు చెందిన చిరంజీవి జూనియర్ విభాగంలో గోల్డ్ మెడల్, సీనియర్ విభాగంలో సిల్వల్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా మేయర్ శాంతి కోటేష్‌గౌడ్ మంగళవారం చిరంజీవిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో జవహర్‌నగర్‌కు చెందిన చిరంజీవి గోల్డ్ మెడల్ సాధించడం గర్వకారణమన్నారు. జాతీయస్థాయిలో మరిన్ని మెడల్స్ సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటేష్‌గౌడ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



చిరంజీవిని సత్కరిస్తున్న మేయర్ శాంతి

ప్రగతి కళాశాలలో ఫ్రెషర్స్ డే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ప్రగతి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు కేపీహెచ్‌బీ కాలనీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారన్నారు. దేశ అభ్యున్నతికి మూలమైన యువతలో కొంతమంది మత్తు పదార్థాలకు బానిసలవ్వడం బాధాకరమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీధర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నయ్య, ఎన్‌సీసీ అధికారి మేజర్ డి. రత్నాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

జగద్గిరిగుట్ట: హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ మఖ్దూం నగర్ లోని అనాథ, పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, టిఫిన్ బాక్స్, స్టేషనరీ అందజేశారు. సీఆర్‌డబ్ల్యూ డి రెయిన్‌బో టీం, హైదరాబాద్, హైరింగ్ మేనేజర్ విలియమ్స్, టీం లీడర్ షేక్ అలీం సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు తూటే విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సామాజిక వేత్త మధుబాబు, ఇన్నారెడ్డి, యూసఫ్ ఖాన్, షఫీ, అన్సారీ, పాషా తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న కావలి గణేష్

దుండిగల్: దుండిగల్‌లోని 3వ వార్డులో ఇటీవల కురుస్తున్న ఇళ్లు కూలిపోవడంతో నిరాశ్రయులైన బాలమణి కుటుంబానికి మాజీ సర్పంచ్ కావలి గణేష్ నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. భవిష్యత్తులో వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అమరం ముత్యంరెడ్డి, తలారి రాజు ముదిరాజ్, వాపుల శ్రీనివాస్, శిరగల్ల బాబు, మూసపేట రమేష్, సందబోయిన వెంకటేష్, పండగ శివ, నాగేంద్ర బాబు పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ



గాయపడిన శౌర్యసింగ్

కుత్బుల్లాపూర్: విద్యార్థుల మధ్య జరిగిన గొడవ పెట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఓ కాలేజీ హాస్టల్ గదిలో ఉంటున్న వీరు మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా గొడవకు దిగి శౌర్యసింగ్ అనే విద్యార్థి పై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతను యాజమాన్యానికి ఫిర్యాదు చేశాడు. మెదక్ జిల్లాకు చెందిన శౌర్యసింగ్(14) ఆయతీ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ కొంపల్లి సినీ ప్లానెట్ వెనక ఉన్న హాస్టల్‌లో ఉంటున్నాడు. అదే హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు అతడిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



కొంపల్లి కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎంపీ ఈటల రాజేందర్, చైర్మన్ శ్రీశైలం యాదవ్ తదితరులు

కుత్బుల్లాపూర్: పెరిగిన జనాభాకు తగ్గట్టుగా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం కొంపల్లి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో చేపట్టబోయే రోడ్లు, మురుగునీటి కాలువలు, వీధి దీపాలు, కల్వర్ట్‌లు, బీసీ, ఎస్సీ కమ్యూనిటీ భవనాలు, స్మశాన వాటికలు, గణేష్ నిమజ్జనాల నేపథ్యంలో చెరువుల వద్ద ఏర్పాట్లు, భద్రత తదితర అంశాలలపై చర్చించారు. విధంగా సబ్‌రిస్ట్రార్ కార్యాలయం నుంచి రావాల్సిన స్టాంప్ డ్యూటీ, జీహెచ్ఎంసీలో కొంపల్లి మున్సిపల్ విలీనానికి వ్యతిరేకంగా కౌన్సిల్ సభ్యులు తీర్మానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి కొంపల్లి మున్సిపాలిటీకి విడుదలైన నిధులపై ఆరా తీశారు. స్టాంప్ డ్యూటీ బకాయిల వివరాలను అడిగిన ఈటల ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ గంగయ్యనాయక్, కౌన్సిలర్లు, కో.ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

కుత్బుల్లాపూర్: విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వ ఘోరంగా విఫలమైందని మేడ్చల్ జిల్లా ఏబీవీపీ కన్వీనర్ నగేష్ అన్నారు. మంగళవారం చింతల్‌లోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిగ్రీలు, ఇంజనీరింగ్ పూర్తయిన విద్యార్థులకు ప్రభుత్వం స్కాలర్‌షిప్‌ల బకాయిలను చెల్లించ లేదన్నారు. ద్యార్థులు ఉద్యోగాలు రాక నిరాశతో ఉన్నారని, ప్రభుత్వం వెంటనే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో సరైన వసతులు కల్పించడం లేదని, ఆహార కల్తీతో పలువురు విద్యార్థులు ఆస్పత్రి పాలవుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ సమస్యలపై దృష్టి సారించి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలన్నారు. లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సెక్రటేరియేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మృతుంజయ, చింతల్ నగర సంయుక్త కార్యదర్శి అర్వింద్, సంతోష్ తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్ ఘటనలో నిందితుల రిమాండ్



పోలీసుల అదుపులో నిందితులు

ఘట్‌కేసర్: స్నేహితుడిని స్విమ్మింగ్ పూల్‌లోకి తోసి అతడి మృతికి కారణకులైన వ్యక్తులను ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మాదాపూర్‌కు చెందిన ఐటీ ఉద్యోగి మంద శ్రీకాంత్ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా ఘనాపూర్‌లోని ఫామ్ హౌస్‌లో విందు ఏర్పాటు చేశాడు. ఆదివారం సాయంత్రం 20 మంది స్నేహితులు విందుకు హాజరయ్యారు. అర్ధరాత్రి దాటగానే గచ్చిబౌలికి చెందిన మీదిమాలె రంజిత్‌కుమార్‌రెడ్డి, యూసఫ్‌గూడకు చెదిన లోకిని సాయికుమార్‌తో పాటు మరో ఇద్దరు తమ స్నేహితుడు అజయ్‌తేజ(24) స్విమ్మింగ్ పూల్‌లోకి తోశారు. అతడికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత దీనిని గుర్తించిన స్నేహితుడు అతడిని బయటకు తీసి జోడిమెట్లలోని ఓ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న ఘట్‌కేసర్ పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు .

వరదకాలువ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ చిట్ల దివాకర్

నిజాంపేట్: వరదముంపు తలెత్తకుండా నాలాలను విస్తరిస్తున్నట్లు నిజాంపేట్ 2వ డివిజన్ కార్పొరేటర్ చిట్ల దివాకర్ తెలిపారు. మంగళవారం ఆయన నిజాంపేట్ కార్పొరేషన్ 2, 22వ డివిజన్ల పరిధిలోని ఎస్ఆర్ఐ లేఅవుట్, ఆర్‌కే లేఅవుట్, ఆర్‌కే బృందవనం ప్రాంతాల్లో జరుగుతున్న వరదనీటి కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువ పనులు పూర్తయితే వరదనీరు సాఫీగా వెళ్లేందుకు మార్గం సుగమమవుతుందన్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న వరద సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఆయన వెంట ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

నిజాంపేట్: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలా రెడ్డి అన్నారు. మంగళవారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మేయర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కమిషనర్ సౌజన్య, మేనేజర్ పవన్‌లతో పాటు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌లలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులపై దృష్టి సారించాలన్నారు. రోడ్ల ప్యాచ్‌వర్క్‌లు, లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు తొలగింపు, డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్, మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ చల్లడం వంటివి చేపట్టాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ చిట్ల దివాకర్, రాజేశ్వరీ చౌదరి, కో ఆప్షన్ సభ్యులు తలారి వీరేశ్ ముదిరాజ్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కోర్టు కాంప్లెక్స్‌కు ప్రత్యామ్నాయ రోడ్డు పరిశీలన



కోర్టు కాంప్లెక్స్‌కు ప్రత్యామ్నాయ రోడ్డును పరిశీలిస్తున్న సీనియర్ న్యాయవాదులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు వద్ద కోర్టు కాంప్లెక్స్‌కు రోడ్డు సౌకర్యం సరిగ్గా లేకపోవంతో ప్రతి రోజు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో మంగళవారం ప్రత్యామ్నాయ రోడ్డును సీనియర్ న్యాయవాదులు పరిశీలించారు. దీనిపై అధ్యయనం చేసి రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులను కలిసి ప్రతిపాదించాలని నిర్ణయించారు.

చెట్ల కొమ్మల తొలగింపు



ఆదర్శ్‌నగర్‌లో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

రంగారెడ్డినగర్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలె సంబంధిత శాఖ అధికారులు మరమ్మతు చర్యలు చేపటారు. మంగళవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఆదర్శ్‌నగర్‌లో విద్యుత్ శాఖ అధికారులు క్రేన్ సహాయంతో విద్యుత్ తీగలపై పడిన చెట్ల కొమ్మలను తొలగించారు.

అసంపూర్తి పనులతో అవస్థలు



శంకరయ్య భవానీకాలనీలో ప్రవహిస్తున్న వరదనీరు

సుభాష్‌నగర్: వర్షాలకు శంకరయ్య భవాని కాలనీ జలవిలయంలో చిక్కుకుంది. ఎగువ ప్రాంతమైన ప్రగతినగర్, ఎలీప్, మిథిలానగర్, కైసర్ నగర్‌ల నుంచి వచ్చే వర్షపు నీరు మద్దెలకుంటలో వచ్చి చేరుతుంది. మూడెకరాల్లో విస్తరించిన మద్దెలకుంట కబ్జాకు గురికావడంతో ఈ సమస్య తలెత్తుతుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. గత మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు వరద నీరు కాలనీలోకి వచ్చి చేరింది. ప్రధాన రోడ్డు లో వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

నాలా పనులు పూర్తి చేయాలి



మద్దెలకుంట నుండి శంకరయ్య భవానికాలనీ, రావి నారాయణరెడ్డి నగర్, కమలమ్మ కాలనీ, బాలయ్య నగర్ మీదుగా పరికి చెరువు వరకు నాలా మంజూరయ్యాయి. కానీ అధికారులు రావి నారాయణరెడ్డి నగర్ నుండి బాలయ్య నగర్ వరకే నాల పనులను పూర్తి చేసి శంకరయ్య భవాని కాలనీలో చేపట్టలేదు. దీంతో ప్రతిసారి వర్షం పడినప్పుడు వరద నీరు కాలనీలో వచ్చి చేరుతుంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి మిగతా పనులు పూర్తి చేయాలి.

రాఘవేందర్ గౌడ్, శంకరయ్య భవాని కాలనీ అధ్యక్షుడు

వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా పెళ్లికూతురమ్మ చెరువు గ్రామానికి చెందిన పి.సతీష్(36) కుటుంబంతో సహా నగరానికి వలసవచ్చి చింతల్ మారుతీ నగర్‌లో ఉంటూ జీడిమెట్లలోని అజాద్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. అతడికి భార్య దేవిశైలజ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా అతను మరుదలి వరసయ్యే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. అప్పటి నుంచి సతీష్ ఆమె వద్దనే ఉంటూ అప్పుడప్పుడు ఇంటికి వచ్చి వెళ్లేవాడు. మంగళవారం సాయంత్రం సతీష్ శైలజకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నట్లు చెప్పాడు. అయితే అతను ఇంటికి చేరుకోకపోవడంతో ఆమె సతీష్ స్నేహితుడు శివాజీ ఫోన్ చేయగా హెచ్ఎంటీ లోపలికి వెళ్లాడని చెప్పాడు. ఆ తర్వాత కొద్ది సేపటికే శైలజకు ఫోన్ చేసిన శివాజీ సతీష్ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.